# కరిష్యే వచనం తవ

సుప్రియ పేరుకు తగినట్టు అందంగా వుంటుంది. బాపు బొమ్మలా, గులాబి రేకులా ఆకర్షణీయంగా ఉంటుంది. డిగ్రీ ఫస్టియర్‌లో ఉంది. టీనేజ్ 'ట్యూన్' మైకంలో ఉంది. కాలేజీకి డుమ్మా కొట్టేసి సన్నీ మీద సినిమాలకు, షికార్లకు తిరుగుతుంటుంది. రాత్రివేళల్లో పబ్బులకు పరుగెడ్తుంది. వెంట ఒకరిద్దరు ఫ్రెండ్స్ సరేసరి.

ఒక్కాగానొక్క కూతురు. కావాల్సినంత డబ్బు. జల్సాలకు లోటులేదు. పట్టించుకుని సరిదిద్దేవారు లేరు. ఆమె అధునాతన దుస్తులు అదరగొట్టేస్తాయి.

తల్లి మహిళా సంఘాలంటూ ఇంటి పట్టునుండదు. కూతురు ధ్యాసలేదామెకు. ఇంటినిండా నౌకర్లు. తండ్రి ఏ వారానికో ఇంటికొస్తాడు.

ఒక రకంగా గృహ వాతవరణం సుప్రియ విచ్చలవిడితనానికి పరోక్ష కారణమైంది. అలాంటి సమయంలో పరిచయమయ్యాడో ఫ్రెండ్. బాయ్ ఫ్రెండ్. ఆ పరిచయం స్నేహం, స్నేహం ప్రేమవైపు పరుగుతీసింది. ఆ ప్రేమ కాస్తా శారీరక సుఖం వైపు దారి తీసింది.

అమ్మాయిలంటే 'యూజ్ అండ్ త్రో ఐటమ్స్' అని భావించే తత్వం ఆ అబ్బాయిది. తనూ విలువలను పెద్దగా పట్టించుకోలేదు సుప్రియ.

కానీ చేసే ప్రతి పనికీ ఏదో ఒక ఫలితం ఉండి తీరుతుందన్న సిద్ధాంతానికి ఊపిరి పోస్తూ...

అకస్మికంగా ఆమె నెల తప్పింది.

అప్పుడు సీరియస్‌గా ఆలోచించడం మొదలెట్టింది.

✣ ✣ ✣

కృష్ణ షోకిల్లారాయుడు. చదివేది ఇంజనీరింగ్.

ఇద్దరాడపిల్లల తర్వాత మగ సంతానం. అతను ఆడింది ఆట, పాడింది పాట.

తండ్రి బిజినెస్‌ల పేరిట నెలలకి నెలలు ఇంటివైపు చూడడు. తల్లికేమో నిత్యం పూజలు-పునస్కారాలు, గుళ్లూ-గోపురాల దర్శనం. వీలు చిక్కితే ఏదో ఒక వ్రతం.

తల్లి వీక్‌నెస్‌ని 'క్యాష్' చేసుకుంటూ బైకేసుకుని బలాదూర్ తిరగడం కృష్ణకి అలవాటైంది. క్యాబరే షోలంటే పడి చస్తాడు. ఆ మోజులో గర్ల్‌ఫ్రెండ్ కోసం గాలం పట్టుకొని వేట ప్రారంభించాడు.

అప్పుడు పరిచయమయ్యాడు ఖాన్. అతడి ద్వారా అంటుకుంది గంజాయి. దానికి పూర్తిగా బానిసయ్యాడు.

ఈ రెండు కథనాలకు కాస్త వెనక్కి వెళితే.

✣ ✣ ✣

"యువత...స్త్రీలు... వీళ్లకు నచ్చే సిన్మాలైతేనే జోరుగా ఆడుతాయ్! నచ్చినట్టు తీస్తే... చచ్చినట్టు విరగబడి చూసేది వీళ్ళే..." టీపాయ్‌మీద సరుకు సర్దుతూ మనసులోని మాట బయటపెట్టాడు కాశీనాథం.

"అలానే చేద్దాం! నాకు కూడా లవ్వు సినిమా అయితేనే వర్కవుటవుద్ది. ఈ కాలం యువతతో అదే గిట్టుబాటవుద్ది" ప్రాస కలిపాడు దర్శకుడు సత్యమూర్తి.

"అలాగయితే స్క్రీన్‌నిండా లవ్ ఫుల్లుండాలి మరి." అంటూ ఫుల్ బాటిల్ ఓపెన్ చేశాడు. రెండు గ్లాసుల్లో సోడా కలిపి నింపాడు.

"మన సిన్మా చూశాక వయసుమళ్లిన వాళ్లే వాపోతారు. మేం వయసులో ఉండగా లవ్ మిస్సయ్యామే అని..." సెల్ఫ్‌గ్యాస్ కొడుతూ గ్లాసెత్తి చీర్స్ కొట్టాడు సత్యమూర్తి.

"సీన్లు కూడా ఘాటు ఘాటుగా ఉండాలి" అంటూ మసాల దట్టించిన చికెన్ సిక్స్టీఫైవ్ ముక్కల్ని ముందుకి జరిపాడు.

గ్లాసెడు మందు గడగడా తాగేసి "షూటింగప్పుడు మనకే మస్తు కిక్కిస్తయ్!" నమ్మకంగా చెప్పాడు సత్యమూర్తి.

"నచ్చావయ్యా నాకు. అందుకే నిన్ను వెతుక్కుంటూ వచ్చాను" సిన్మా లాగించేద్దామని ఫిల్మ్ ఇండస్ట్రీలో తొలిసారి కాలు మోపిన కాశీనాథం... అప్పుడే తన బొమ్మ శతదినోత్సవం కూడా జరిపేసుకున్నంత ఆనందంగా పకపకా నవ్వాడు.

"మీరు చూస్తూ ఉండండి. ఇరగదీస్తా..." నిషా ఎక్కుతుంటే మత్తులో హుషారెక్కువైంది. తూలిపోతూ తేలిపోసాగాడు.

"ఇరగదీసేది నన్ను కాదుకదా?" సణుక్కున్నాడు కాశీనాథం.

అలా ఇద్దరి మధ్యన ఓ సినిమాకి అంకురార్పణై ప్రేక్షకులు వీక్షించడానికి రంగం సిద్ధమవసాగింది.

✣ ✣ ✣

సిట్టింగుల మీద సిట్టింగులు జరుగుతున్నాయి. ఫైవ్‌స్టార్‌లో అడ్డా.

"కథెవర్ది?" కాశీనాథమడిగాడు.

"కొత్త కుర్రాడున్నాడు" బదులిచ్చాడు మూర్తి.

"కుర్రాడా?" పెదవ్విరిచాడు.

"యంగ్ డైనమిక్... వెరీ టాలెంటెడ్! కత్తి... కత్తనుకోండి."

"గాట్లేం పెట్టడు కదా?" చురకేశాడు.

"ఫెంటాస్టిక్ జోక్! తమరిలో హ్యూమరసం బీరులై పారుతోంది. ఛ!ఛ! ఏరులై పారుతోంది" ఆ రోజు మందు లేకపోవడంతో పెదాల్ని నాలుకతో తుడుపుకుంటూ ఆయన్ని అంతరిక్షానికెగరేసాడు మూర్తి.

"అంత సీనుంటే నేనే నాల్గు కామెడీ సీన్లు లాగించేవాడిని. కథైతే జోరుగా అల్లమను"

"గతంలో మల్లెపూల దండలల్లినవాడు కదా! బోల్డనుభవం" అనేసి నాలిక్కరుచు కుంటూ "సూపర్‌గా అల్లుతున్నాడు" అన్నాడు.

"సినిమాలో ఊహించని మలుపులుండాలి"

'లవ్వు సిన్మాలో మలుపులేముంటాయి నా బ్రాంది? ధనవంతుల అబ్బాయి. పేదింటి అమ్మాయి. ఇద్దరి మనసులు 'ప్లస్స'వుతే ప్రేమవుతుంది. పెద్దలు అడ్డొస్తే 'గుణకార'మవుతుంది. ఇద్దట్లో ఎవరు త్యాగం చేసినా 'భాగాహార'మై పోతుంది. పెద్దల్నెదిరిస్తే కుటుంబాలకు 'మైనస్స'వుతారు. ఇదేకదా లవ్వు సినిమా 'గణితం.' కాకపోతే మన సిన్మాలో రెండు జంటల లవ్వుంటుంది. వెరయిటీగా!' అనుకొని.

"బోలెడుంటాయి" అన్నాడు పైకి.

"ఏదో ఒక సీన్ చెప్పు"

"హీరో హీరోయిన్ని ఎత్తుకెళ్లే సీనుంటుందొకటి. విలన్ గ్యాంగ్ వెంటపడి తరుముతుంటారు. అబ్బ... అప్పుడు చూడాలి. ప్రేక్షకులే కాదు... కెమెరామెన్ కూడా ఊహించని మలుపులే మలుపులు...! కాకపోతే అలాంటి రోడ్‌వే వెతకమని అసిస్టెంట్ డైరెక్టర్‌ని పురమాయించాను" చివరి వాక్యానికి గొంతు తగ్గించాడు.

బుర్ర తిరిగిన కాశీనాథం కంగుతిన్నాడు.

'డైరెక్టర్ ఎకసెక్కాలాడుతున్నాడో ? నిజంగా సీన్ చెప్పాడో ?' అర్థమవక గింజుకున్నాడు.

"సరేగానీ! బడ్జెట్ బస్తాలకొద్దీ పెరక్కూడదు మరి" కాశీనాథం చిన్న పిల్లాడిలా బుంగమూతి పెట్టాడు.

'లో బడ్జెట్ సినిమా అంటే బయ్యర్లెవరొస్తారు ముందుకు? సిన్మా తీయడమంటే చింతచెట్టు కింద గింజలేరుకున్నట్టనుకున్నాడు' లోపల విసుక్కున్నాడు.

పైకేమో "అస్సలు దాటదు. ఎలాగంటే..."అంటూ చెప్పుకొచ్చాడు మూర్తి.

చెవి ఒగ్గి వినసాగాడు నవ నిర్మాత.

"ఒక యుగళగీతంలో హీరో హీరోయిన్లిద్దరూ అమెరికాలో గెంతుతున్నట్టు కలగంటారు. కానీ మనం పిక్చరైజేషన్ చేసేది హైద్రాబాద్‌లోనే. ఉత్తుత్తి అమెరికా షాట్స్ మధ్య మధ్యలో ఇరికిస్తామన్నమాట. సో... భారీ బడ్జెట్ ఊసే ఉండదు. డౌట్ క్లియరనుకుంటా" విడమర్చి చెప్పాడు.

బట్టబుర్ర గోక్కున్నాడు కాశీనాథం.

సగం అర్థమై... మరి సగం ప్రశ్నార్థకమై...

"హీరో-హీరోయిన్ వేషం వేసెటోళ్లు ఎట్లుండాలనుకున్నవ్? కస్కలు... కస్కల్లా ఉండాలి" హితబోధ చేశాడు కాశీ.

'కస్కలంటే కొత్తవాళ్లను పెట్టాలి. న్యూ ఎంట్రీ గాళ్లతో నూటికొకటి... సిన్మాలాడినంత మాత్రాన అదే హిట్ ఫార్ములా అవుతుందా? కొత్త మొహాలను పెట్టి మన ఏడ్పుగొట్టు కథతో రీళ్లకు రీళ్లు చుడితే ఒక్కడైనా చూస్తాడా?' స్వగతంలో అనుకున్నాడు మూర్తి.

"మన సీనియర్ హీరో హీరోయిన్స్ కస్కల్లాగ కనబడాలనే అమెరికా నుండి స్పెషల్‌గా మేకప్‌మెన్‌ని, కాస్ట్యూమ్ డిజైనర్‌ని ఇక్కడకు రప్పిస్తున్నా" అనేసి మళ్ళీ నాలుక్కరుచుకున్నాడు.

డైలమాలో పడ్డ కాశీనాథం గుడ్లు మిటకరించాడు.

అతడి వాలకం గమనించి "ఈ విషయంలో మీరేం వర్రీ అవకండి, నే చూస్కుంటాగా?" అంటూ సమాధానపరిచాడు.

శాంతించాడు నిర్మాత.

✣ ✣ ✣

మరోరోజు-

"మిరప-పసుపు-పత్తి అమ్మి తెచ్చిన సొమ్ములవి. జర పైలంగ ఖర్చుపెట్టాలి డైరెక్టరూ" పొదుపు సూత్రాలు వల్లించాడు కాశీనాథం.

"నాకు వదిలేయండిక. మీరేం వర్రీ మొర్రీ కాకండి" జనం నమ్మకాన్ని క్యాష్ చేసుకొని ఉడాయించే చిట్‌ఫండ్ కంపెనీ యం.డి.లా హామీ ఇచ్చాడు మూర్తి.

"ఇంత ఇదిగా చెప్తున్నావు కాబట్టి వర్రీకాను. మరా మొర్రీ ఏంటో?" సంశయంగా ప్రశ్నించాడు కాశీనాథం.

నిర్మాత భూతద్దం వేసుకొని తన భాషా ప్రావీణ్యాన్ని ఎండగడతాడని ఊహించని మూర్తి గుటకలు మింగుతూ అన్నాడు.

"ప్రాసకోసం వాడా! ఆ పదానికర్థం నాక్కూడా తెలియదుగాక తెలియదు. వదిలేయండిక" అంటూ దొంగ సీడీలమ్మే వాడిలా అదోమాదిరి చూపులు సారించాడు.

"సర్సర్లే కానీ.... సిన్మా మాత్రం ఇలాగే తికమకగా తీసి జనాల్ని కన్ఫ్యూజన్లో పడేయకు. మధ్యలో నేను మునుగుతా"

"అలాంటిదేం జరగదు"

"అస్సలు జరగొద్దు"

"మిరపమ్మిన డబ్బులంటిరి, సీన్లు హాటు హాటుగా వచ్చినయ్! పత్తి పైసలంటిరి, బట్టలు పొదుపుగానే వాడతా! పసుపుకు తగిన ఫలితం... మాంచి సెంటిమెంట్ డ్రామా వర్కవుటవుతోంది"

మూర్తి ఎక్స్‌ప్రెషన్స్‌కి కాస్త కుదుటపడ్డాడు కాశీనాథం.

"క్యాస్ట్యూమ్స్ వెర్రెక్కించాలి" అన్నాడు.

"అర్ధనగ్న దృశ్యాలు బోలెడుంటాయి"

"డైలాగ్స్...?"

"పిచ్చిపిచ్చిగా నచ్చుతాయి కుర్రకారుకి. డబల్ మీనింగ్స్ దట్టిస్తున్నాం"

"ఆ... అలాగుండాలి. థియేటర్లు ఈలలు, చప్పట్లతో మార్మోగాలి. కాలేజీ పిల్లలు హుషారెక్కి... వేడెక్కి పోవాలి"

"పోరు, మళ్లీ మళ్లీ థియేటర్స్‌కే వస్తారు" అంటూ నవ్వాడు మూర్తి.

"మొత్తానికి నీ దగ్గర విషయముందయ్యా డైరెక్ట్రూ! పెట్టుబడి తీరుబడిగానైనా వెనక్కొస్తుందన్న నమ్మకం నాగార్జున సిమెంట్‌లా బలపడ్తోంది."

"నాటోన్లీ నమ్మకం... గ్యారంటీ స్కీము నాది. నా కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్, డైరెక్షన్ ఒకటేమిటి? అన్నీ ఐ.యస్.ఐ. స్టాంప్డ్! ఢోకాలేదు. కాసుల వర్షం కురవాల్సిందే. అలా కాని పక్షంలో, వారంలో... ఛ!ఛ! మీ వెంటే ఉంటాన్నేను. రొటీన్ వ్యక్తిని కాదు. నాది వన్ ప్లస్ వన్ ఉదార స్కీము. మీకు మరో బంపర్ చిత్రం ఉచితంగా చేసిపెడతా"

"చాలా గొప్పోడివిలే" సౌండ్ బయటకు రానీయకుండా పళ్ళు పటపటలాడించాడు కాశీనాథం.

"ఉట్టి కెగురలేను, జర ఉయ్యాలూపి జోలపాడమన్న చందం చేయకు" తిరిగి అసహనం ప్రదర్శించాడు.

కిమ్మన్లేదు మూర్తి. నోర్మూసుక్కూర్చున్నాడు.

✤ ✤ ✤

కాలం గడుస్తోంది.

దర్శక నిర్మాతలిద్దరి మధ్య కెమిస్ట్రీ బాగా వర్కవుటయ్యింది.

కథ-కథనాలన్నీ సిద్ధమయ్యాయి. నటీనటుల కాల్షీట్స్ కుదిరాయి.

పిక్చరు షురూ... డైరెక్టరుకు నచ్చినట్టు కొంత, నిర్మాత మెచ్చినట్టు మరికొంత, యాక్టర్స్ సలహాల మేరకు ఇంకొంత, మిగతా టెక్నీషియన్స్ వేలుపెట్టినట్టు చాంతాడంత... అలా సెట్స్ మీదికి వెళ్ళాక, కథా కథనాల్ని ఫుట్‌బాల్, వాలీబాల్‌తో సహా అన్ని బాల్స్‌తో ఏక బిగిని ఆడుకున్నాక మూడు షెడ్యూల్స్‌లో పిక్చర్ పూర్తయింది.

"హమ్మయ్య!" ఊపిరి పీల్చుకున్నాడు కాశీనాథం.

మూర్తి సరేసరి.

బ్రహ్మాండమైన ముహూర్తంలో సినిమా విడుదలయ్యింది.

కానీ-

✤ ✤ ✤

ఇంత నడిచిన ఈ (సిన్మా) కథకు ముగింపు మిగిలి ఉంది.

"ఈ వారమే విడుదలైన మీ సినిమా 'బూతుకు మేమే వారసులం' సారీ! 'ప్రేమకు మేమే వారసులం!' గురించి కేవలం రెండే రెండు ప్రశ్నలు..." అంటూ మూర్తి వెంటపడ్డారు విలేఖర్లు.

మనిషి ఉల్లాసంగా లేడు. మునుపటి ఉత్సాంహాలేదు. పడిపోయిన షేర్ల రేఖలు చూపలేని గ్రాఫ్‌పేపర్‌లా మొహం వేలాడిపోతోంది.

చిక్కకూడదనుకున్నాడు కానీ పట్టువదలని విక్రమార్కుడి బ్రదర్స్‌లా వెంటపడ్డారు వాళ్ళు. ప్రెస్‌మీట్‌లో పాల్గొనక తప్పలేదతనికి.

ఫేసు చాటేస్తే లాభం లేదనుకున్నమూర్తి లాజిక్ ప్రదర్శించాడు.

"ప్రశ్న ఒకటైపోయిందిగా" అన్నాడు గడుసుగా.

ఎంత లాక్కుంటే అంత చాలు అన్న వైఖరిగా "హిట్టా? ఫట్టా?" ఒక్క ముక్కలో ప్రశ్నించాడో విలేఖరి మరింత తెలివిగా.

"నా ఖర్మ కాలింది. ఫట్టే అయ్యాను" అన్నాడు ట్రాజెడీ వాలకంతో.

హర్షధ్వానాలతో చప్పట్లు చరిచారు.

అయోమయమయ్యాడు సత్యమూర్తి.

"నిజంగా మీరు చాలా గ్రేటండీ! సినిమా ఫ్లాపైనా... హిట్టంటూ ట్రాష్ వసూళ్ళు చూపే వాళ్ళున్న ఈ ఇండస్ట్రీలో... మీ సినిమాకి సేఫ్ పిక్చరని టాక్ వచ్చినా సూపర్ హిట్ కాలేదని కాబోలు... మీరలా ప్రకటించడం... మీ నిరాడంబరత్వానికి చిహ్నం" అంటూ అతనొకటంటే వీళ్ళొకటి అర్థం చేసుకొని తెగ కొనియాడారు.

బూతుని దట్టించి, అర్ధనగ్న దృశ్యాలను రెట్టించి లవ్వుతో కలగాపులగం చేసేసి మలయాళం సినిమాకే మాతృకలా.... వాళ్ళే విస్తూరపోయేలా రీళ్ళు చుట్టేసిన... ఈ సినిమాకి యువత ఎగబడ్డారు. మూర్తి దర్శకుడిగా హిట్ కొట్టాడు.

బట్... నిజజీవితంలో... వెండితెర వెనుక ఫెయిలయ్యాడు.

సగటు తండ్రిగా పరాజితుడయ్యాడు.

సుప్రియ ఇతగాడి కన్నకూతురు. అబార్షన్ చేయించుకుంది. ప్రేమిస్తున్నానంటూ.... గత కొద్ది రోజులుగా తన వెంటపడుతున్న అనామక కాలేజీ అబ్బాయితో చెట్టాపట్టాలేసుకొని ఎంచక్కా ఎగిరిపోయి... పెళ్ళి చేసుకొంది.

అచ్చు తన తండ్రి తీసిన సినిమాలోని సన్నివేశంలాగానే!

మానవ సంబంధాల్ని నైతిక విలువలతో ముడివేస్తూ యువత భవితని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బాధ్యతకి అవకాశమున్నా... చౌకబారు సినిమా తీసి.. స్వయంగా తన రక్త సంబంధాన్నే పెడత్రోవ పట్టించడానికి పరోక్ష కారకుడైనందుకు... చింతిస్తూ కూర్చున్నాడిప్పుడు సత్యమూర్తి.

అదీ విషయం!

✣ ✣ ✣

విలేఖర్లీసారి అదే ఫక్కీలో నిర్మాత కాశీనాథాన్ని చుట్టుముట్టి ప్రశ్నలపర్వం

కురిపించారు.

సేమ్ టు సేమ్ -

"నా ఖర్మ కాలింది. ఇల్లు గుల్లయ్యింది" నెత్తీ నోరు కొట్టుకుంటూ లబోదిబో మన్నాడు కాశీనాథం. బుష్ చేత చీవాట్లు తిన్న ముషారఫ్‌లా ఫేసు మార్చాడు.

అతను నిర్మాతగా వ్యవహరించిన సినిమాకి పెట్టుబడితోపాటుగా తొలివారంలోనే లాభాలు వచ్చేటట్లున్నాయని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి.

కానీ-

కృష్ణ ఈయనగారి పుత్రరత్నమే!

పక్కింటమ్మాయి కృష్ణని ముగ్గులోకి దింపింది. గంజాయి మత్తులోని కృష్ణ అమ్మాయి మత్తుకి తలవొగ్గాడు. ఆ అమ్మాయిని ఎగరేసుకు పోయాడు. వెళ్తూ వెళ్తూ నగలూ-నట్రా, ఏ.టి.యం. కార్డు వెంటేసుకుపోయాడు.

ఈ థాట్‌కి ప్రేరణనిచ్చిందా నాన్న తీసిన సినిమాలోని షాటే!

**సినిమా, మానవ జీవితాన్ని దిగజార్చే జూదం కాదని... ఓ కళాత్మక వ్యాపారమని...**

గ్రహించని కాశీనాథం మన సంస్కృతీ సంప్రదాయాల మనోభావాల్ని దెబ్బతీస్తూ సినిమా తీసి... జేబులు నింపుకోవాలని ఆశపడి... రియల్ లైఫ్‌లో భంగపడ్డాడు.

తాను నిలబడ్డ కొమ్మని చేతులారా తానే నరుక్కున్నాడు.

**"కరిష్యే వచనం తవ"**

-అనే సంస్కృత వాక్యార్థం... 'మీరు (సినిమాలో) చెప్పినట్టే చేస్తాను'ను... అక్షరాలా నిజం చేస్తున్నట్టు...

దర్శక-నిర్మాతల పిల్లలే ఫాలో అయ్యారు.

చెడపకురా చెడెదవు!

**(24.10.2008)**

**సంక్రాంతి కథల పోటీలో ఎంపికైన కథ**

*